సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం ▪ 26 ▪ ఫిబ్రవరి ▪ 2023



బీజేపీని ఓడించే పార్టీకే మద్దతు

బీజేపీని ఓడించే పార్టీకే మద్దతిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

వివరాలు 10లో ▸



వైభవంగా తిరుచ్చిసేవ

మన్యంకొండలో లక్ష్మీవెంకటేశ్వరస్వామికి శనివారం రాత్రి తిరుచ్చిసేవ నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.2 /19.1

వాతావరణం

రోజంతా వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఉండే అవకాశం ఉంది. ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.7,932

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శనివారం 1439క్వింటాళ్ళ వేరుశనగ రాగా క్వింటాలుకు గరిష్ఠం రూ.7932, కనిష్ఠం రూ.3399, సరాసరి రూ. 5880 ధరలు లభించాయి. అలాగే, 24 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్ఠం రూ. 6500, కనిష్ఠం రూ. 4120, సరాసరి రూ. 6460 ధర పలికింది. 28 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్ఠం రూ. 7856, కనిష్ఠం రూ. 6389, సరాసరి రూ. 7586 ధరలు వచ్చాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలోన్ని అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పోలీసుశాఖ ముందుకెళ్లాల్సిందిగా మల్టీజోన్ ఐజీపీ షానవాజ్ అన్నారు. శనివారం రోడ్డు ప్రమాదాల నివారణ అంశాంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రహదారి భద్రతపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని రహదారి భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకుని ప్రమాదాల నివారణ విషయాలను మెరుగు పరుచుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో రోడ్డు ప్రమాదాలు నివారణకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని డేంజర్ స్పాట్ల వద్ద ప్రత్యేక గుర్తులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా వేల మంది మృత్యువాత పడుతున్నారన్నారు. పలు భద్రతా నియమావళి విషయాలను ఎస్పీ సృజనను అడిగి తెలుసుకున్నారు. వీసీలో డీఎస్పీ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి



మల్దకల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులకు వెలికి తీయాలని డీఈఓ సిరాజుద్దీన్ సూచించారు. శనివారం ఎల్కూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. హస్తకళలు, చిత్రకళ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా హస్తకళలు, చిత్ర కళల్లో తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. దారాలతో తయారు చేసిన గాంధీ చిత్ర పటాన్ని విద్యార్థులు డీఈఓకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి ఎస్తేర్‌రాణి, హెడ్మాస్టర్ రవికిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల గోస పట్టని రాష్ట్ర ప్రభుత్వం


ఉండవెల్లి: కేసీఆర్ పాలనలో రైతులకు ఆర్డీఎస్‌లో చివరి ఆయకట్టుకు నీరు అందక, 24 గంటల విద్యుత్ అందక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బంగారు శృతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజా గోస–బీజేపి భరోసా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఎక్కడ సరఫరా చేస్తున్నారని, కనీసం 8 గంటల ఇవ్వాలని మొర పెట్టిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి హామీలను తుంగలో తొక్కారన్నారు. ప్రతి ఒక్కరు ఆలోచించి బీజేపిని గెలిపించాలని, అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. నాయకులు అయ్యపురెడ్డి, మధుసూదన్ గౌడు, నాగేశ్వర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, బంగి లక్ష్మణ్, జలగరి అశోక్, మహేందర్, గుర్నాత్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింధనూర్ ఉప సర్పంచ్‌గా నర్సింహారెడ్డి

అయిజ: మండలంలోని సింధనూర్ ఉపసర్పంచ్‌గా గ్రామానికి చెందిన చిన్న నర్సింహారెడ్డిని వార్డు సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంపీడీఓ సాయిప్రకాష్ తెలిపారు. సింధనూర్ సర్పంచ్ రంగమ్మ ఈ నెల 6న అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అప్పటికే ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న సుజాతకు సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఖాళీ అయిన ఉపసర్పంచ్ స్థానానికి శనివారం పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యుల సమక్షంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఎన్నిక నిర్వహించారు. మెజార్టీ సభ్యులు నర్సింహారెడ్డికి ఆమోదం తెలపడంతో ఆయనను ఉపసర్పంచ్‌గా అధికారులు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్‌కు గ్రామస్తులు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

సమస్యల వెల్లువ

- 22ఏళ్లుగా కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు లేవు
- దోమలు, కుక్కలతో అల్లాడిపోతున్నాం
- తాగునీటి సమస్య పరిష్కరించాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో ప్రజల నుంచి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ వెల్లడి



ఫోన్ ఇన్‌లో ప్రజా సమస్యలను నోట్ చేసుకుంటున్న కమిషనర్ నర్సింహ

గద్వాల రూరల్: 'సార్.. మేము క్రమం తప్పకుండా మున్సిపాలిటీకి పన్నులు కడుతున్నాం. కానీ మా కాలనీలో కనీస మౌళిక సదుపాయాలు కరువయ్యాయి.. 22ఏళ్లుగా మాకాలనీలో డ్రైనేజీలు, రోడ్లు లేవు, ముళ్లకంపలు పందులు, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. మాకాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది.. మా వీధికి చెత్తబండి రావడం లేదు.. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందే ఆగి దోమలతో ఇబ్బందులు పడుతున్నాం..' ఇలా గద్వాల మున్సిపాలిటీలోని పలు వార్డుల నుంచి ప్రజలు మున్సిపల్ కమిషనర్ నర్సింహకు విన్నవించుకున్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు శనివారం 'సాక్షి' గద్వాల మున్సిపల్ కమిషనర్ నర్సింహతో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. కాలనీలో నెలకొన్న సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు చెప్పిన సమస్యలను నోట్ చేసుకున్న కమిషనర్ వాటి పరిష్కిస్తానని సమాధానమిచ్చారు. ఆ వివరాలిలా..

సమస్య: 22ఏళ్లుగా మా కాలనీలో డ్రైనేజీలు, రోడ్లు లేవు. గెలిపించిన కౌన్సిలర్లను అడిగితే పట్టించుకోవడం లేదు. అదేవిధంగా పందుల సమస్య కూడా ఎక్కువగా ఉంది. మేము మున్సిపాలిటీ అన్ని టాక్స్‌లు కడుతున్నాం. ఓట్లప్పుడు మాత్రం మా ఇళ్లకు వచ్చి వేడుకుంటారు. డ్రైనేజీలు, రోడ్లు వేయకుంటే టాక్సులు కట్టం.

– విజయలక్ష్మీ, విద్యా, శిల్ప, లక్ష్మీ రెవెన్యూ కాలనీ వాసులు, గద్వాల

కమిషనర్: సమస్యలను నోట్ చేసుకున్నా. వారం లోపు మీ కాలనీని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం.

సమస్య: మున్సిపల్ కార్యాలయం వెనక ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద డ్రైనేజీపై ఏర్పాటుచేసిన దిమ్మెల వద్ద యాచకులు నివాసముంటున్నారు. అక్కడే మలమూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మేము షాపులలో ఉండలేకపోతున్నాం.

– సతీష్, గద్వాల

కమిషనర్: ఆయా స్థలాలను పరిశీలించి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తాం.

సమస్య: మా వీధిలో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. బయటకు వెళ్లాలంటే జంకుతున్నాం.

– మంజూర్ అహ్మద్ – 8వార్డు, రోహిత్‌కుమార్ – చింతలపేట, శేఖరయ్య – వేదనగర్, రామాంజనేయులు – కౌన్సిలర్, వీరాంజనేయులు – లింగంబావి కాలనీ

కమిషనర్: కుక్కలను ఊరి బయటికి తరలిస్తాం. స్టెరిలైజేషన్ చేసి కుక్కల బెడద తొలగిస్తాం.

సమస్య: షెరెల్లివీధిలో దోమల సమస్య అధికంగా ఉంది. పట్టించుకునేవారే లేరు.

– అహ్మద్ – షెరెల్లివీధి, వెంకటేష్ – నల్లకుంట

కమిషనర్: ఇప్పటికే పట్టణంలో ఫాగింగ్ చేయిస్తున్నాం. ఇప్పుడు కూడా క్రమం తప్పకుండా దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

సమస్య: బీడీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పరిష్కరించండి.

– మహబూబ్‌పాష, సలీం, మోహిద్ – బీడి కాలనీ గద్వాల

కమిషనర్: ప్రత్యేకంగా మంచినీళ్ల ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తాం. నీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

సమస్య: డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీలో మురుగు ఇళ్లమధ్యనే చేరుతుంది. దుర్గంధంతో రోగాల భారిన పడుతున్నాం.

– జాన్‌పాష, షేరెల్లివీధి, గద్వాల

కమిషనర్: డ్రెయినేజీ నిర్మాణం కోసం నిధులు అవసరం. నిధుల లభ్యతను బట్టి ఖచ్చితంగా నూతన డ్రెయినేజీ నిర్మాణం చేపడతాం.

సమస్య: మా కాలనీల్లో విద్యుత్తు సమస్య తీవ్రంగా వేధిస్తోంది. పరిష్కరించండి.

– మహబూబ్‌పాష – బీడీ కాలనీ, రాజు – గంజిపేట, గద్వాల

కమిషనర్: ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడతా. విద్యుత్తు సమస్య పరిష్కరిస్తాం.

సమస్య: పాతపోస్టాఫీసు వద్ద ఓపెన్ స్థలాల్లో చెత్తను వేసి ఇబ్బదులకు గురిచేస్తున్నారు. హట్కరిపేటలోని చేపల మార్కెట్, చికెన్ షాపుల నుంచి మాంసాన్ని రోడ్డుపైనే వేస్తుండడంతో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది.

–వెంకటేష్, అడ్వకేట్, హట్కరిపేట

కమిషనర్: చేపలు, చికెన్ దుకాణ యజమానులకు నోటీసులు ఇస్తాం. చెత్తను ఆరుబయట వేయకుండా అవగాహన చర్యలు తీసుకుంటాం.

సమస్య: వేదనగర్‌లోని పాండురంగస్వామి ఆలయం వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇక్కడి గుంతలు దోమలకు నిలయంగా మారింది.

– శేఖరయ్య, మల్లేష్ – వేదనగర్, గద్వాల

కమిషనర్: కుక్కలను అక్కడి నుంచి తరలిస్తాం. గుంతలు పూడ్చి, దోమల సమస్యను పరిష్కరిస్తాం.

సమస్య: భీంనగర్‌లో కంపచెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్యనే చేరి దోమలకు నిలయంగా మారింది. 16, 17వార్డు కౌన్సిలర్లకు చెబితే మా పరిధిలోకి రాదంటూ దాటవేస్తున్నారు. అదేవిధంగా డ్రెయినేజీ సమస్య కూడా ఉంది.

– శ్రీకాంత్‌రెడ్డి, బాలాజీఅపార్ట్‌మెంట్, భీంనగర్

కమిషనర్: త్వరలో వార్డుకొచ్చి పరిశీలిస్తాం. నిధుల లభ్యతను బట్టి డ్రెయినేజీ నిర్మాణం చేపడతాం.

సమస్య: మా వీధిలోకి 30రోజులుగా చెత్తబండి రావడం లేదు. డ్రైనేజీలను కూడా శుభ్రం చేయడం లేదు.

– చంద్రశేఖర్, 26వ వార్డు, శ్రీనివాస్ – గాయత్రి అపార్ట్‌మెంట్

కమిషనర్: విధిగా చెత్తబండి పంపించేలా చూస్తాం. డ్రైనేజీలు క్లీనింగ్ చేయిస్తాం.

సమస్య: 1వ వార్డులో కంపచెట్లు పెరిగి ఇబ్బందులకు గురవుతున్నాం.

– నరేష్, వెంకంపేట, గద్వాల

కమిషనర్: వీలైనంత త్వరలో కంపచెట్లు తొలగించేలా చూస్తాం.

సమస్య: రైల్వేగేటు కాలనీలో పందుల సమస్య ఎక్కువగా ఉంది. రోగాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. – గాంధీరాజు – రెండవ రైల్వేగేటు కాలనీ, వాసు – శ్రీనివాసకాలనీ

కమిషనర్: పందుల యజమానులకు నోటీసులు ఇచ్చి అక్కడి నుంచి పందులను తరలించి సమస్య పరిష్కస్తాం.


సాగునీటికి ఆందోళన చెందవద్దు

అలంపూర్: సాగు నీటి కోసం రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాయంలో శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు సాగు నీటిని అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు తుమ్మిళ్ల ఎత్తిపోత పథకం వద్ద నీటి నిల్వలు పెరుగుతాయని చెప్పారు. మరుసటి రోజే తుమ్మిళ్ల ఎత్తిపోత పథకం ఉదయమే తుమ్మిళ్ల మోటర్లను ఆన్ చేసి సాగునీటిని అందించడానికి అధికారులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ, ఈఈ, ఆర్డీఎస్ ఈఈలతో ఫోన్‌లో మాట్లాడి జూరాల లింక్ కెనాల్ ద్వారా డిస్ట్రిబ్యూటరీ 36 నుంచి ఆర్డీఎస్ ఆయకట్టు పొలాలకు నీటిని అందించే విధంగా చర్చించినట్లు తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలు చేతికి అందివచ్చే వరకు సాగునీటిని అందించడానికి అన్నీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి పక్ష పార్టీలు అనవసర రాజకీయాలు చేసి రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి పక్ష పార్టీలు అవసరమైతే రైతులకు సహాయం చేయాలని అంతేకాని ఇలా తప్పుదోవ పట్టించవద్దన్నారు.

పప్పుశనగ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని వల్లూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని మట్టిపెల్లలు లేకుండా, 14శాతం తేమ మించకుండా సెంటర్‌కు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రూ.5,335 విక్రయించి లాభపడాలని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ప్రతి రైతు కూడా టోకెన్ తీసుకొని స్థానిక వ్యవసాయ అధికారితో ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని, దళారీల భారిన పడకుండా ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రంగా రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మహేశ్వరెడ్డి, నాయకులు గిడ్డారెడ్డి, జయచంద్రారెడ్డి, నాగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బీఎస్పీ రాజ్యాధికార యాత్ర


అలంపూర్‌లో సభా ప్రాంగణంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర ఈ నెల 26వ తేదీన ఆదివారం అలంపూర్ నియోజకవర్గానికి చేరుకోనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 186 రోజులపాటు యాత్ర కొనసాగగా.. అలంపూర్‌లో ప్రారంభోత్సవ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో దాదాపు 10రోజుల పాటు యాత్ర కొనసాగనున్నట్లు బీఎస్పీ నాయకులు తెలిపారు. అన్ని మండలాలను, గ్రామాలను కలుపుతూ యాత్ర కొనసాగుతుందన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సభకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతం, బీఎస్పీ రాష్ట్ర నాయకులు దాసరి ఉషా, అనతారెడ్డి, సాంబశివగౌడు, సంతోష్ రెడ్డి, బాలవర్ధన్ గౌడ్ తదితరులు హాజరుకానున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అలంపూర్ చౌరస్తాలో స్వాగతం పలకనున్నట్లు, అక్కడి నుంచి అలంపూర్ టూరిజం వరకు ర్యాలీ ఉంటుందని నాయకులు తెలిపారు. టూరిజం నుంచి జోగుళాంబ అమ్మవారి ఆలయం వరకు ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. జోగుళాంబ అమ్మవారి, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, షా–అలీ–పహిల్వాన్ దర్గాలో ప్రార్థనలు చేసి, అనంతరం సభా స్థలానికి చేరుకుంటారని, బహుజనులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు



గద్వాల రూరల్: పట్టణంలో కుక్కల సమస్యను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. ఈమేరకు ఆయన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, అధికారులతో సమీక్షించారు. పట్టణంలో 2020–21 సంవత్సరంలో 735 కుక్కలున్నట్లు గుర్తించి వాటిని పట్టుకుని అడవులకు తరలించడం జరిగిందన్నారు. అదేవిధంగా మరో 453 కుక్కలను పట్టుకుని సంతానోత్పత్తి లేకుండా వాటికి శస్త్ర చికిత్సలు చేయడం జరిగిందని, పట్టణంలో కుక్కల సమస్య అధికంగా ఉండడంతో ఈ ఏడాది కూడా పట్టణంలో ఉన్న కుక్కలను గుర్తించి వాటిని జనావాసాలకు దూరంగా అడవులలో వదిలేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందు కోసం కుక్కలను పట్టుకునే ప్రత్యేకంగా బృందాలు రప్పించడం జరిగిందని, ఆదివారం పట్టణంలోని కుక్కలను పట్టుకునే ప్రక్రియను మొదలు పెడుతున్నట్లు కేశవ్ తెలిపారు. అదేవిధంగా ఎక్కడైన కుక్కల సమస్య ఉంటే శానిటరీ ఎన్స్పెక్టర్లు మన్సూర్, రంగన్న ఫోన్ నంబర్లు 798153363, 9059549095 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించని పక్షంలో నేరుగా తన నంబర్ 9493604666 కాని, మున్సిపల్ కమీషనర్ నంబర్ 9849907791 కాని ఫోన్ చేయవచ్చన్నారు.

'మన బడి' పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: జిల్లా మన ఊరు–మన బడి పనులు త్వరితగిన పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 161 పాఠశాలలకు గాను మొదటి విడతగా మొత్తం 24 పాఠశాలలను ప్రారంభించే క్రమంలో ఇప్పటికే మూడు పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన పాఠశాలలో అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పల్లె దవాఖానాలు, సబ్‌సెంటర్ల నిర్మాణాలకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇంచార్జీ డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ, డీఆర్‌డీఏ ఏపీడీ నాగేంద్రం, పీఆర్ ఈఈ ఆంజనేయులు, డీఈ సలీం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న జడ్జి గంట కవిత

గద్వాల అర్బన్: ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, వారిని ప్రోత్సాహించినా వారిపై కఠిన చర్యలతో పాటు శిక్షలు ఉంటాయని గద్వాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంట కవితా దేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలను రూపుమాపాలని, ఎవరూ కూడా ప్రోత్సాహించవద్దన్నారు. పిల్లలను పనులకు పంపవద్దని, వారిని చదివించాలన్నారు. పిల్లలను పనులకు పంపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాలల సంరక్షణ చట్టం, గృహహింస చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిడబ్ల్యూ ముషాయిదా బేగం, న్యాయవాదులు లక్ష్మన్న, నాగరాజు, పట్టణ ఎస్సై షాకుర్, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రమేషాచారి, మధుసూధానాచారి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, అమరవాయి చింతలామునిన ల్లారెడ్డి స్వామి వార్ల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, అర్చకులు రవిచారి, ధీరేంద్రదాసు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను తొలగింపజేస్తున్న కమిషనర్ నర్సయ్య

అయిజ: మున్సిపాలిటీలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. శనివారం పట్టణంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చేవేసే కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఈసందర్భంగా పట్టణంలోని పెద్దవాగు బ్రిడ్జి పక్కన నిర్మించిన ఓ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసేందుకు సిబ్బంది వెళ్లడంతో సదరు ఇంటి యజమాని, వారి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులను పిలిపించుకొని నిర్మాణాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. గోడలు నెర్రలు బారుతున్నాయని, సమయం ఇస్తే తామే కూలగొడతామని ఇంటి సభ్యులు కోరడంతో ఆదివారం వరకు సమయం ఇచ్చారు. తిరిగి సోమవారం వస్తామని, అప్పటి వరకు పూర్తి చేయకపోతే యంత్రాలతో కూలగొట్టిస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. రోడ్డు వెడల్పు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల దూరం వరకు అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూలగొడుతామని, అడ్డగించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ మహబూబ్‌నగర్.
(రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య బ్యాంకు) రి.సం.20942
పోస్టు బాక్స్ నం.14, జిల్లా కోర్టు రోడ్, ప్రధాన కార్యాలయము, మహబూబ్‌నగర్ - 509 001

మహాజన సభ సమావేశపు నోటీసు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ మహబూబ్‌నగర్ యొక్క మహాజన సభ సమావేశము తేది:03.03.2023 శుక్రవారము ఉదయము 11 గంటలకు డీసీసీ బ్యాంకు ఆడిటోరియం, ప్రధాన కార్యాలయం, మహబూబ్‌నగర్ నందు గౌరవ బ్యాంకు అధ్యక్షులు శ్రీ చిట్యాల నిజాం పాషా గారి అధ్యక్షతన ఏర్పాటు చేయడమైనది. కావున గౌరవ సభ్యులందరూ సదరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనది.

తేది : 15.02.2023. సం/- ముఖ్య కార్యనిర్వహణ అధికారి

ఏకాదశ దినకర్మ



మంచికి మారుపేరు, సహనశీలి, మానవత్వం, పెద్దరికం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిగా చిరునవ్వుల పలకరింపులతో అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొంది మాకు ఆదర్శంగా నిలిచి మీరు మా నుండి దూరమైన మీ మధుర స్మృతులు ప్రతిక్షణం మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుని ప్రార్థిస్తూ... మీ దివ్య ఆశీస్సులతో మరియు మీ తీపి జ్ఞాపకాలతో...

శోకతప్త హృదయాలతో...

మీ కుటుంబ సభ్యులు :
భర్త : బి.నాగేశ్వర్‌రెడ్డి
కొడుకు : బి.రఘువేంద్రరెడ్డి, కోడలు : బి.శ్వేతరెడ్డి
కొడుకు : బి.శ్రీనివాస్‌రెడ్డి,
కూతురు : రాధిక రెడ్డి, అల్లుడు : వినోద్‌రెడ్డి
మనుమడు : అభీష్‌రెడ్డి,
మనుమరాళ్లు : బి.సాన్విరెడ్డి, నిత్యాసహస్ర

కీ॥శే॥ బి.వరలక్ష్మి గారు
సర్పంచ్, కొంకల గ్రా॥, వడ్డేపల్లి మం॥
జోగులాంబ గద్వాల జిల్లా
మరణం : 16-02-2023

కార్యస్థలం : తేది : 26-02-2023 ఆదివారం
మధ్యాహ్నం 12-00 గంటలకు
మా స్వగృహం కొంకల గ్రామము నందు జరుగును.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


రమేష్‌రెడ్డి (ఫైల్)

అమ్రాబాద్‌: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దెంది రమేష్‌రెడ్డి (41) తనకున్న వ్యవసాయ పొలంలో వరిసాగు చేశాడు. శనివారం తెల్లవారుజామున పంటకు నీరు పారించేందుకు పొలానికి వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద విద్యుత్‌ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూసే సరికి మృతిచెంది కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమ్రాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

అనాథలుగా మారిన చిన్నారులు..

రమేష్‌రెడ్డి భార్య శ్రావణి మూడేళ్ల క్రితమే మృతి చెందడంతో ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. ప్రస్తుతం రమేష్‌రెడ్డి తల్లిదండ్రులు సుగుణమ్మ, వెంకట్‌రెడ్డి వద్దనే పెరగాల్సి ఉంది. రమేష్‌రెడ్డి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లిఫ్ట్‌ గుంతలో పడి దినసరి కూలీ..

మహబూబ్‌నగర్‌ క్రైం: కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో ఉన్న లిఫ్టు గుంతలోపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. రూరల్‌ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..హన్వాడ మండలం బుద్దారం గ్రామానికి చెందిన మందుల వెంకటయ్య(60) శనివారం పట్టణంలోని జేజేఆర్‌ గార్డెన్‌ సమీపంలో ఉన్న ఆకుల బాలరాజు అనే వ్యక్తి నూతన ఇంట్లో దినసరి కూలీగా పని చేయడానికి వెళ్లాడు. ఇంటి ఆవరణలో పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు లిఫ్ట్‌ గుంతలో పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ను చికిత్స కోసం జిల్లా జనరల్‌ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2.30ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య మందుల పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో విరక్తి చెంది ఆత్మహత్య

మదనాపురం: మండలంలోని తిరుమలయ్యపల్లిలో శనివారం ఓ వృద్ధుడు క్యాన్సర్‌తో విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గ్రామస్తులను కలిచివేసింది. గ్రామానికి చెందిన బూసెట్టి బాలీశ్వరయ్య (63) కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతూ.. తనకు ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గడంలేదు. దీంతో జీవితంపై విరక్తి శుక్రవారం అర్ధరాత్రి తన ఇంటి నుంచి టీవీఎస్‌ మోపెడు ద్విచక్రవాహనంపై బయలుదేరి గ్రామ సమీపంలోని రైల్వే గేటు వద్దకు వచ్చి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య విజయమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ జి.రామకృష్ణ తెలియజేశారు.

యువకుడి బలవన్మరణం


నరేష్‌ (ఫైల్)

బల్మూర్‌: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల కేంద్రంలో వెలుగు చూసింది. ఎస్‌ఐ శివానందంగౌడ్‌ కథనం మేరకు.. బల్మూరుకు చెందిన బోట్కా నరేష్‌ (29), రాజేశ్వరి భార్యాభర్తలు. శుక్రవారం ఇద్దరూ గొడవపడి రాజేశ్వరి తన ముగ్గురు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన నరేష్‌ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. శనివారం అటుగా వెళ్లిన రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నరేష్‌ తల్లి బాలమైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

నాగనూలులో వివాహిత..

నాగర్‌కర్నూల్‌ క్రైం: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పుర పరిధిలోని నాగనూలులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శైలజ (20)కు డిండి మండలం కొత్తపల్లికి చెందిన వ్యక్తితో రెండునెలల క్రితం వివాహమైంది. ఈ నెల 18న అత్తగారి ఊరి నుంచి నాగనూలుకు వచ్చిన శైలజ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొంది. గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వీణారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్‌ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని.. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ వివరించారు.

ఆశజూపి టోకరా

విదేశీ కరెన్సీ రూ.5లక్షలు అపహరణ

- సబ్బు బిల్లలకు కరెన్సీ నోట్లు చుట్టి మోసం
- ఎనిమిది మంది నిందితుల గుర్తింపు
- ముగ్గురి అరెస్టు.. రిమాండ్‌కు తరలించిన పోలీసులు


నిందితులను చూపుతున్న సీఐ రమేశ్‌బాబు, తదితరులు

జడ్చర్ల: విదేశీ కరెన్సీ ఎర వేసి ఏకంగా రూ.5లక్షలు అపహరించిన సంఘటనకు సంబంధించిన కేసులో పోలీసులు 8 మంది నిందితులను గుర్తించగా శనివారం ముగ్గురు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీఐ రమేశ్‌బాబు వెల్లడించారు. ఈనెల 5న బాదేపల్లి పోస్టాఫీస్‌ సమీపంలో 8మంది ముఠా సభ్యులు సినీ పక్కీలో బాధితుల నుండి రూ.5లక్షలు తీసుకుని సబ్బు బిళ్లకు తెల్లకాగితాలు చుట్టి పైపైన విదేశీ కరెన్సీ పెట్టిన కట్టను బ్యాగులో పెట్టి ఇచ్చారు. నిందితుల నుంచి బ్యాగును తీసుకెళ్లిన బాధితులు ఇంటికి వెళ్లి చూడగా అసలు విషయం బయటపడింది. అంతకు ముందు వారం రోజుల కిందట మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటలో ఫరీసా యాస్మిన్‌ నిర్వహిస్తున్న ఆప్టికల్‌ షాప్‌కు కేసులోని ప్రధాన నిందితుడు ఇమ్రాన్‌ ఖాన్‌ అలియాస్‌ రిపున్‌ వెళ్లి ఫరీసా యాస్మిన్‌ భర్త సిరాజొద్దీన్‌ను పరిచయం చేసుకుని తన దగ్గర అరబ్‌ కరెన్సీ దిరమ్స్‌ ఉన్నాయని, అది తీసుకుని ఇండియన్‌ కరెన్సీ ఇవ్వాలని కోరాడు. సిరాజొద్దీన్‌ అంతకు ముందు కొంత కాలం దుబాయ్‌లో ఉండి రావడంతో దిరమ్స్‌ కరెన్సీని గుర్తించి తీసుకున్నాడు. ఇంకా తన దగ్గర మరింత దిరమ్స్‌ కరెన్సీ ఉందని నమ్మబలికాడు.

రూ.15లక్షలు అవసరం ఉందంటూ..

తనకు కొంత నగదు అవసరం ఉందని తన దగ్గర 10వేల దిరమ్స్‌ కరెన్సీ ఉందని దీని విలువ రూ.22 లక్షలు ఉందని తనకు రూ.15 లక్షలు ఇవ్వమని కోరాడు. చివరకు రూ.10 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని తరువాత జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో ఇరువురు కలుసుకొని అరబ్‌ కరెన్సీ దిరమ్స్‌ను పరిశీలించుకుని నమ్మకం కుదిరేలా రెక్కి కూడా నిర్వహించుకున్నారు. తదుపరి తనకు అత్యవసరంగా డబ్బు అవసరం ఉందని నిందితుడు ఫోన్‌ చేసి చెప్పగా తన దగ్గర రూ.5లక్షలు మాత్రమే అందుబాటులో ఉందని, మిగతా డబ్బు తరువాత ఇస్తానని చెప్పగా సరేననడంతో ఈ నెల 5న బాదేపల్లి పోస్టాఫీస్‌ దగ్గరకు రావాలని చెప్పారు. సిరాజొద్దీన్‌ రూ.5లక్షల నగదును బ్యాగులో తీసుకుని బాదేపల్లి పోస్టాఫీస్‌ ప్రాంతానికి చేరుకున్న తరువాత ఇమ్రాన్‌ఖాన్‌ తన భార్య అస్మాతో కలిసి తమ దగ్గర దిరమ్స్‌ ఉన్న బ్యాగు ఇచ్చి రూ.5లక్షల బ్యాగు తీసుకుని ఎవరి దారిన వారు వెళ్లారు. సిరాజొద్దీన్‌ మహబూబ్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్లి బ్యాగులో ఉన్న దిరమ్స్‌ కరెన్సీ కట్టను పరిశీలించగా కింద మీద మాత్రమే దిరమ్స్‌ కరెన్సీ ఉన్నాయి. మధ్యలో సబ్బు బిళ్లకు తెల్లకాగితాలు చుట్టిన నోట్ల బండిల్‌గా తయారు చేసి ఉండడంతో తాము మోసపోయామని లబోదిబోమన్నారు. వెంటనే 100 డయల్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయడంతో స్థానికపోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. బాధితురాలు ఫరీసా యాస్మిన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న అరబ్‌ కరెన్సీ దిరమ్స్‌

బంగ్లాదేశ్‌ నుంచి వలస వచ్చి..

ఈక్రమంలో శనివారం జడ్చర్ల కొత్తబస్టాండ్‌లో అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న మహ్మద్‌ రషీద్‌ఖాన్‌, మహ్మద్‌ సోయల్‌, రహీమ్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని వారి బ్యాగును తనిఖీ చేయగా 21 దిరమ్స్‌ కరెన్సీ పట్టుబడింది. విచారించగా జడ్చర్లలో రూ.5లక్షలు అపహరించింది తామేనని నేరం అంగీకరించారు. అంతకు ముందు నారాయణపేటలో కూడా ఇదే తరహాలో రూ.3లక్షలు అపహరించామని నిందితులు అంగీకరించారు. వీరంతా బంగ్లాదేశ్‌ నుంచి వలస వచ్చిన రోహింగ్యాలుగా గుర్తించారు. వీరు ఢిల్లీ, హర్యాణ తదితర ప్రాంతాలలో నివాసం ఉంటూ వివిధ ప్రాంతాలకు వెళ్లి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించారు. మహబూబ్‌నగర్‌, హన్వాడలలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ మోసాలకు పాల్పడినట్లుగా సీఐ తెలిపారు. బాదేపల్లిలో సంఘటన జరుగుతున్న సమయంలో వీరంతా వేర్వేరుగా అదే ప్రాంతంలో గస్తీ తిరుగుతూ పరిసరాలను అంచనా వేశారన్నారు. ఈకేసులో ప్రధాన నిందితుడు ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు అతని భార్య ఆస్మా, మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, తమకు పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే విదేశీ కరెన్సీని నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న బాధితురాలిపైన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, లెనిన్‌, ఖాదర్‌,తదితరులు

బాలికపై బాలుడి అత్యాచారయత్నం

- నాగర్‌కర్నూల్‌ జిల్లాలో కలకలం రేపిన ఘటన

కల్వకుర్తి రూరల్‌: నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తి మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. శుక్రవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత బాలిక ఇంటికి చేరుకుంది. అదే సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు లేకపోవడంతో తమ్ముడితో కలిసి ఇంటి వద్దే ఆడుకుంటుండగా గమనించిన బాలుడు తమ ఇంట్లోకి పాము వచ్చిందని, చూపిస్తా రమ్మంటూ బాలికను తీసుకెళ్లాడు. చిన్నారి వెంట తమ్ముడు వస్తుండగా బెదిరించి పంపే ప్రయత్నం చేశాడు. బాలికను బాలుడు ఇంటి మిద్దెపైకి తీసుకెళ్లి చెంపలపై కొరకడంతో 5 పంటి గాట్లు పడ్డాయి. బాలికను వివస్త్రను చేసి అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించగా మిద్దెపై నుంచి బాలిక అరుపులు వినపడడంతో పాటు బాలిక సోదరుడు వారి ఇంటి ముందే ఏడుస్తుండడంతో సమీప బంధువు ఏమైందని ఆరా తీశాడు. వెంటనే మిద్దెపైకి వెళ్లి బాలికపై బాలుడు చేస్తున్న అఘాయిత్యాన్ని అడ్డుకుంది. తర్వాత పొలం వద్ద ఉన్న తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె వెంటనే వచ్చి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్ష చేసేందుకు మహిళా వైద్యులు లేకపోవడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గతంలోనూ అసభ్య ప్రవర్తన

బాలుడు గతంలోనూ పలుమార్లు ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఇద్దరు ముగ్గురి ఇళ్లలో చోరీలకు సైతం ప్రయత్నించినట్లు ఆరోపించారు. అత్యాచారయత్నం ఘటనపై సమాచారం అందుకున్న కల్వకుర్తి సీఐ సైదులు శనివారం గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎస్‌ఐ రమేశ్‌యాదవ్‌ మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం బాలుడిని జువైనల్‌ హోంకు తరలిస్తామని చెప్పారు.

తండ్రిని హతమార్చిన కొడుకు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

గట్టు: కుటుంబానికి ఆసరా ఉండాల్సిన ఓ తండ్రి బాధ్యతలను విస్మరించి.. తాగుడుకు బానిసై, అప్పులు చేసి, ఆ కుటుంబానికి తలనొప్పిగా మారడంతో కన్నకొడుకే తండ్రిని హతమార్చాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఇందువాసిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ ఉరుకుందు(48) రోజు తాగి కుటుంబసభ్యులతో గొడవకు దిగేవాడు. ఉరుకుందు చేసిన అప్పులను తీర్చాలంటూ అప్పులిచ్చిన వారు ఇంటికి వచ్చి గొడవ పడుతుండటంతో తండ్రికి పలుమార్లు పద్ధతి మార్చుకోవాలని కుటుంబసభ్యులు సూచించారు. తండ్రి పేరిట ఉన్న పొలాన్ని కొడుకుల పేరున మార్చాలని అనేక పర్యాయాలు అడిగినా పట్టించుకోలేదు. తండ్రి చేష్టలతో విసిగివేసారిన చిన్న కొడుకు కుర్వ నాగేష్‌ శుక్రవారం రాత్రి గ్రామంలోని మఠంలో తండ్రి నిద్రిస్తుండగా గొడ్డలితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నాగేష్‌ పరారయ్యాడు. ఉదయం రక్తపు మడుగులో పడి ఉన్న ఉరుకుందును చూసిన చుట్టుపక్కల వారు విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. విషయం తెలుసుకున్న గద్వాల సీఐ చంద్రశేఖర్‌, ఎస్‌ఐ పవన్‌కుమార్‌ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఉరుకుందు భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పరారీలో ఉన్న నాగేష్‌ కోసం గాలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మూడు ఇళ్లల్లో చోరీ

- భారీగా బంగారం, వెండి, నగదు అపహరణ


ఘటన స్థలంలో వేలిముద్రలు పరిశీలిస్తున్న క్లూస్‌టీం

నాగర్‌కర్నూల్‌ క్రైం: మండలంలోని గగ్గలపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మల్లయ్య, బాలకిష్టమ్మ, నిరంజన్‌ ఇళ్ల తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు విరగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. మల్లయ్య ఇంట్లో 16 తులాల బంగారు నగలు, 42 తులాల వెండి వస్తువులు, రూ.1.20 లక్షల నగదు, బాలకిష్టమ్మ ఇంట్లో రూ.49 వేలు, నిరంజన్‌ ఇంట్లో అర తులం బంగారం అపహరణకు గురైంది. అత్తగారి ఊరికి వెళ్లి శనివారం ఉదయం తిరిగి వచ్చిన మల్లయ్య ఇంటి తాళం విరిగి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హన్మంతు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న డీకే అరుణ

జడ్చర్ల టౌన్‌: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మండలంలోని కోడ్గల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోదీ గురించి వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనుల్లో కేంద్ర నిధులు ఉన్నాయని వివరించాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం కేసీఆర్‌ ప్రజలను మభ్యపెట్టకుండా, మరోసారి కల్లబొల్లి మాటలకు వంచనకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వీరబ్రహ్మాచారి, రమేష్‌జీ పాల్గొన్నారు.

నూనెగింజ పంటల ఆవశ్యకత ఎక్కువ


ఆముదం పంట సాగుపై మాట్లాడుతున్న ఏడీఆర్‌ మల్లారెడ్డి

బిజినేపల్లి: ఆధునిక ప్రపంచంలో వంటకాల్లోనే కాకుండా వివిధ సందర్భాల్లో నూనె ఆవశ్యకత ఎంతో ఉందని, అందుకోసం రైతులు నూనె గింజల పంటలను సాగు చేయాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌ డా.మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎర్రకుంట తండాలో గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద యాసంగిలో రైతులు సాగు చేసిన ఆముదం పంటను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఏడీఆర్‌ మాట్లాడుతూ ఆముదం పంటకు ప్రస్తుత మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉన్నందున రైతులు సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నళిని, ఈశ్వర్‌రెడ్డి, దివ్యారాణి, మాధురి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ పరిష్కారాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ వంశీ, ఏఈవో అఖిల్‌ రైతులు పాల్గొన్నారు.

పేకాట కేసులో భిన్నాభిప్రాయాలు

- తన కుమారుడిని హత్య చేశారంటూ తండ్రి అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

గద్వాల క్రైం: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేయగా.. తప్పించుకునే క్రమంలో ఓ వ్యక్తి కింద పడి మృతిచెందాడంటూ గ్రామస్తులు పేర్కొనడం, ఆమేరకు కథనాలు ప్రచురితమవగా తాజాగా ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తన కుమారుడిని ఎవరో హత్య చేశారంటూ మృతుడి తండ్రి ఫిర్యాదు చేయగా శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్‌ ఎస్‌ఐ ఆనంద్‌ తెలిపిన వివరాలిలా.. గద్వాల మండలంలోని కుర్వపల్లికి చెందిన గోపాల్‌ (28) గురువారం రాత్రి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం భద్రయ్యదొడ్డి సమీపంలో అనుమానాస్పదంగా కిందపడి మృతి చెందినట్లు తండ్రి కుర్వ రాముడుకు గ్రామస్తులు తెలియజేశారు. అక్కడికి వెళ్లి చూడగా కుమారుడి శరీరంపై గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేశాడన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఎలాంటి కేసు లేకుండా ఉండాలంటే పేకాట రాయుళ్లు నష్టపరిహారం కింద రూ.10లక్షల ఇవ్వాల్సిందిగా బాధి కుటుంబ సభ్యులు డిమాండ్‌ చేశారని, రూ.5లక్షల వరకు ఇస్తామని చెప్పినట్లు సమాచారం. నష్టపరిహారం అడిగినంత ఇవ్వనందుకే మృతుడి తండ్రి కక్షపూరితంగా పేకాట రాయుళ్లపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే, గ్రామంలో నిత్యం రూ.లక్షలు వెచ్చించి పేకాట ఆడతారని, పోలీసులు మామూళ్లు పుచ్చుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తారని, పేకాట రాయుళ్లపై ముందునుంచే కఠినమైన చర్యలు తీసుకొని ఉంటే ఇలాంటి ఘటన చోటుచేసుకునేది కాదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కృష్ణా వంతెన మరమ్మతు పూర్తి



మాగనూర్‌ (కృష్ణ): జాతీయ రహదారి–167పై తెలంగాణ సరిహద్దులో కృష్ణానదిపై ఉన్న పురాతన వంతెన మరమ్మతుల కారణంగా ఈనెల 22 నుంచి శనివారం వరకు వంతెనపై రాకపోకలు పూర్తిగా నిషేధించి వాహనాలను మరికల్‌ దగ్గర నుంచి దారి మళ్లించి రాయచూర్‌కు పంపిస్తున్నా విషయం తెలిసిందే. అయితే శనివారం మధ్యాహ్నానికి వంతెన మరమ్మతులతో పాటుగా బీటీ నిర్మాణం కూడా పూర్తయిందని మక్తల్‌ సీఐ సీతయ్య తెలిపారు. దీంతో ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సాయంత్రం 7గంటల నుంచి వంతెనపై రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. కావున వాహనదారులు మళ్లీ యథావిధిగా రాకపోకలను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు, ప్రజలు గమనించాలని అన్నారు.

బైరాపూర్‌లో గడ్డివాములు దగ్ధం

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో రెండు గడ్డివాములకు శనివారం మధ్యాహ్నం నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన కల్వ శ్రీరాములు, కల్వ పరందాములు వ్యవసాయ పొలంలో గడ్డివాములు నిల్వ ఉంచుకున్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయాయి. వాటి విలువ దాదాపుగా రూ.80వేలు ఉంటుందన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడ చెందిన ముడావత్‌ గోపాల్‌ నాయక్‌ వ్యవసాయపొలంలో ఉన్న గుడిసె దగ్ధమై, వ్యవసాయ పరికరాలు కాలిపోయి రూ.50 వేల ఆస్తినష్టం అయినట్లు బాధితుడు తెలిపారు. సర్పంచ్‌ ఇందిరా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

అయిజ: మండలంలోని కొత్తపల్లిలో గడ్డివాముతోపాటు పూరిగుడిసె దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాచర్ల ఆంజనేయులుకు చెందిన గడ్డివాముకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. మంటలు చెలరేగడంతో సమీపంలో ఉన్న పూరిగుడిసె కాలిపోయింది. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు ఆంజనేయులు, గ్రామ రైతులు కోరారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత



మరికల్‌: ఐజ మండలం ఉప్పల్‌ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి మరికల్‌ మండలం నుంచి అక్రమంగా పీడీఎస్‌ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. శనివారం టాటాఏసీ వాహనంలో 20 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొంతకాలంగా అక్రమంగా మరికల్‌ మండలంలో రేషన్‌ బియ్యం వ్యాపారం చేస్తున్న ఐజ మండలం ఉప్పల్‌ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆర్‌ఐ కాశప్ప కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యాన్ని స్టాక్‌ పాయింట్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్‌బాబు, పోలీస్‌ సిబ్బంది సీతారామ్‌, రాజులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSIONS FOR GUIDENCE
Admissions for Guidence B.Tech/M.Tech/ M.B.A, LLB / B.Sc, M.Sc Agri, P.G (All), Ph.d Few Seats Available. Cont: 9391471754, 8985533447, Hyd.

LAND FOR SALE
నాగర్‌కర్నూల్‌ జిల్లా అచ్చంపేట - తెల్కపల్లి మధ్య గట్టుతుమ్మెన్‌ గేటు వద్ద SH 20 మెయిన్‌ రోడ్డుకు ఒక ఎకరం పొలం అమ్మబడును. సంప్ర., సెల్‌: 7868946786.

PLOT FOR SALE
0% ఇంట్రెస్ట్‌ తో 30 నెలల ఈక్వల్‌ EMI తో రాజాపూర్‌ దగ్గర అన్ని డెవలప్‌మెంట్స్‌తో 147 గజాలు MUDA (HMDA) లేఅవుట్లో ఓపెన్‌ Plots కలవు. ఫ్రీ సైట్‌ విజిట్‌ ఫోన్‌: 8949695027

భూత్పూర్‌ లో ఎమ్మార్వో ఆఫీస్‌ వెనకాల సాయిరాం బిల్డర్స్‌లో, ప్లాట్‌ నెం: 228, ఈస్ట్‌ ఫేస్‌ 60 ఫీట్ల రోడ్డు, NH 44 దగ్గరగా 200 గజాల ప్లాట్‌ అమ్మబడును సెల్‌: 9553822566.

SERVICES
వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేకోవర్‌ లోన్‌, NPA కేసులు తక్కువ సిబిల్‌ స్కోర్‌ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237

BUSINESS OFFER
Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283

Invest small amount in trading company and get daily returns : 8317689472

HEALTH CARE
ORTHOPEDIC SURGEON

LAND FOR SALE
అచ్చంపేట నుండి నాగర్‌కర్నూల్‌ వెళ్ళే హైవే రోడ్‌కి జింగుంట గ్రామము, కమర్షియల్‌ ల్యాండ్‌
4 ఎకరాల 20 గుంటలు మరియు 3 ఎకరాల 38 గుంటలు
భూమి అమ్మబడును.
సెంట్రల్‌ గవర్నమెంటు అప్రూవ్‌ చేసిన హైదరాబాద్‌ చెన్నై వయా నంద్యాల, తిరుపతి మీదగా వెళ్ళే 4 లైన్‌ నేషనల్‌ హైవేకి దగ్గరలో ఈ భూములు కలవు.
Ph:6305109047

NAME CHANGE
I, Konda Reddy (Old name as recorded my passport) R/o H.No 42-222/5, RTC Colony, Wanaparthy Town & dist. T.S. Here by declare that my actual and correct name as per aadhar card Kuppireddy Konda Reddy (new name) S/o Kuppireddy Ram Reddy. Cell no: 9440328944.

GYNECOLOGY
కార్తీక్‌ హాస్పిటల్‌, పంకేసుల రోడ్‌, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్‌, బి.పి. షుగర్‌ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ ఎస్‌.చంద్రశేఖర్‌, M.D. ఫిజీషియన్‌, డా॥ పార్వతీదేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్‌: 10-8PM, 08518-226162

WANTED
విజయవాడలో A/c & Coolers రెంటల్‌ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్‌-3, డ్రైవరు-3, హెల్పర్స్‌-5, జీతం: 18-25,000 ట్రైనింగ్‌/భోజనం/వసతి ఫ్రీ 90300 44646.

హైదరాబాద్‌లోని ఓల్డేజ్‌ హోం కొరకు రెసి॥ లేడీ కేర్‌టేకర్స్‌, రెసి॥ వంటవారు (వ. 35-40) & ఆయాలు కావలెను. మంచి జీతం, ఫ్రీ వసతి+ భోజనం. ఫోన్‌: 9700006899, 7981467098

పనివారు కావలెను. హైదరాబాద్‌, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

Banking Collections Field Executive Salary: 15,000 + Good Incentive (2 Wheeler Must) Address: 6-3-191/C/1, Fortune 9, 2nd Floor, Opposite Yashodha Hospital Road, Somaji guda, Hyderabad - 500082 Contact Numbers: 8220640613/ 7305045987

HAPPY BIRTHDAY
సాక్షి
పుట్టిన రోజు
తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్‌
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.: 200/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు:
మహబూబ్‌నగర్‌: 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల: 9010076222
నాగర్‌కర్నూల్‌: 9010006785
వనపర్తి: 9010068317
గద్వాల: 9553955603
నారాయణపేట: 9010962007

గమనిక

స్నేహితుడిని కత్తితో పొడిచి..
తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో యువకుడి దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి


నిందితుడు హరిహర కృష్ణతో జీవన్ (సర్కిల్‌లో)

అబ్దుల్లాపూర్‌మెట్/కల్వకుర్తి టౌన్/ చారకొండ/ ఎంజీయూ (నల్లగొండ రూరల్)/ నార్కట్‌పల్లి: అతను స్నేహితుడు.. కానీ తాను ప్రేమించిన యువతికి దగ్గర అవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు.. మనసులో కక్ష పెంచుకున్నాడు.. ఫ్రెండ్స్‌తో గెట్ టుగెదర్ ఉంది రమ్మని పిలిచాడు.. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో పొడిచి చంపేశాడు.. తర్వాత గుండె, తల, మొండెం, కాళ్లు చేతులను వేరుచేసి.. వాటి ఫొటోలను వాట్సాప్ ద్వారా ప్రియురాలికి పంపి పైశాచికానందం పొందాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో శనివారం ఆలస్యంగా వెలుగు చూసిన దారుణ ఘటన ఇది. హతుడు, నిందితుడు ఇద్దరూ స్నేహితులు, ఇంజనీరింగ్ విద్యార్థులు కావడం, ప్రేమ విషయం హత్యకు దారితీయడం కలకలం రేపింది.

ఇంటర్ నుంచీ స్నేహితులు..

పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని వంకరాయి తండాకు చెందిన నేనావత్ శంకర్ కుమారుడు నేనావత్ నవీన్ (20), వరంగల్‌కు చెందిన పేరాల ప్రభాకర్ కుమారుడు పేరాల హరిహరకృష్ణ (21) ఇద్దరూ స్నేహితులు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీఎల్ కాలేజీలో కలిసి ఇంటర్ చదివారు. తర్వాత హరిహరకృష్ణ పీర్జాదిగూడలోని అరోరా కళాశాలలో.. నవీన్ నార్కట్‌పల్లిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బీటెక్‌లో చేరారు. అయినా తమ స్నేహాన్ని కొనసాగిస్తూ వచ్చారు. అయితే ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే హరిహరకృష్ణ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. నవీన్ కూడా అదే యువతిని ఇష్టపడ్డాడు. సదరు యువతి కూడా కొంతకాలం నుంచి తనను దూరం పెడుతూ నవీన్‌తో చనువుగా ఉండటాన్ని హరిహరకృష్ణ జీర్ణించుకోలేకపోయాడు. నవీన్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయానికి వచ్చాడు.

ముందుగానే ప్లాన్ చేసుకుని..

నవీన్‌ను అంతమొందించాలని రెండు నెలల నుంచే ప్లాన్ చేసుకున్న హరిహరకృష్ణ.. ఈ నెల 17న ఇంటర్ ఫ్రెండ్స్ గెట్ టు గెదర్ ఉందని, రావాలని నవీన్‌కు ఫోన్ చేశాడు. ఇది నమ్మిన నవీన్ యూనివర్సిటీ నుంచి హైదరాబాద్‌కు వచ్చి హరిహరకృష్ణను కలిశాడు. కాసేపు ఇద్దరూ బైక్‌పై కలిసి తిరిగారు. సాయంత్రం మద్యం తీసుకుని బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. మద్యం తాగుతూ మాట్లాడుకున్నారు. ఈ సమయంలో ప్రేమించిన యువతి విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అప్పటికే ప్లాన్ ప్రకారం పదునైన కత్తి తెచ్చుకున్న హరిహరకృష్ణ దానితో దాడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న నవీన్ దీనిని ప్రతిఘటించలేకపోయాడు. తీవ్ర ఆవేశంలో ఉన్న హరిహరకృష్ణ కత్తితో నవీన్ తలను, కాళ్లు, చేతులు, ప్రైవేట్ పార్ట్స్‌ను కోసి ముక్కలు చేశాడు. ఛాతీ భాగాన్ని చీల్చి గుండెను బయటికి తీశాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మరో స్నేహితుడి ఇంటికి వెళ్లి.. స్నానం చేసి..

నవీన్‌ను హత్య చేసిన తర్వాత హరిహరకృష్ణ నేరుగా హాసన్ అనే మరో స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. కాస్త టెన్షన్‌గా కనిపించడంతో ఏం జరిగిందని హాసన్ ప్రశ్నించినా ఏమీ లేదంటూ.. బాత్రూంలోకి వెళ్లి స్నానం చేసిన వచ్చాడు. తర్వాత హత్య గురించి హాసన్‌కు చెప్పాడు. దీనితో భయపడిన హాసన్ వెంటనే వెళ్లి పోలీసులకు లొంగిపోవాలని సూచించగా.. తెల్లారాక వెళ్తానని చెప్పి, అక్కడే నిద్రపోయాడు. మరునాడు మూసారాంబాగ్‌లోని తన సోదరి మమత ఇంటికి వెళ్లాడు. నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నాడు.

ఏమీ తెలియనట్టు నటిస్తూ..

ఈ నెల 16న యూనివర్సిటీ నుంచి బయటికి వచ్చినప్పటి నుంచీ నవీన్ ఆచూకీ తెలియకపోవడంతో.. అతడి కుటుంబ సభ్యులు గాలించడం మొదలుపెట్టారు. హరిహరకృష్ణను కలిసి ఏం జరిగిందని నిలదీశారు. అయితే ఓ యువతి విషయంలో తమ మధ్య గొడవ జరిగినది నిజమేనని, కానీ తర్వాత ఇద్దరం కలుసుకున్నామని హరిహరకృష్ణ చెప్పాడు. నవీన్ నార్కట్‌పల్లికి వెళ్తానంటే విజయవాడ జాతీయ రహదారిపై దింపేసి తాను హైదరాబాద్‌కు వెళ్లిపోయానని వివరించాడు. నవీన్ కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం రాకుండా అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నప్పుడువారి వెంటే ఉంటూ నమ్మించాడు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చాడని నవీన్ స్నేహితులు తెలిపారు.

అన్నివైపులా ఒత్తిడి పెరగడంతో..

నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్న హరిహరకృష్ణ తర్వాత విశాఖపట్నంతోపాటు పలు ప్రాంతాల్లో తిరిగాడు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చి ప్రియురాలికి ఫోన్ చేసి పిలిపించుకుని మాట్లాడాడు. నవీన్‌ను హత్య, ఇతర అంశాలను ఆమెకు వివరించగా.. పోలీసులకు లొంగిపోవాలని ఆమె చెప్పినట్టు తెలిసింది. మరోవైపు హరిహరకృష్ణను కలవడానికి వెళ్లిన నవీన్ ఆచూకీ లేకపోవడం, హరిహరకృష్ణ ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుండటంతో.. నవీన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిహరకృష్ణ కుటుంబ సభ్యులనూ ప్రశ్నించారు. ఇలా అన్నివైపులా ఒత్తిడి రావడంతో హరిహరకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసులు అతడిని శనివారం రాత్రి హయత్‌నగర్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. కాగా.. నవీన్ హత్యకు హరిహరకృష్ణ ఒక్కడే పాల్పడ్డాడా, మరెవరైనా ఉన్నారా అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ హత్యకు గురైన రోజు హరిహరకృష్ణతోపాటు మరో స్నేహితుడైన జీవన్ కూడా తన బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ వరకు వచ్చినట్టు తెలిసింది. అతను వెళ్లిపోయాక హత్య జరిగిందా? కలిసే హత్య చేశారా అన్నదానిపై ఆరా తీస్తున్నారు.

నవీన్ కుటుంబ సభ్యుల ఆందోళన

నిందితుడు హరిహరకృష్ణను కఠినంగా శిక్షించాలంటూ నవీన్ కుటుంబ సభ్యులు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని.. నిందితుడికి శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దొరకకుండా జాగ్రత్తపడి..

నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ ఆధారాలు దొరకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహంపై డ్రెస్‌ను తొలగించి దూరంగా పడేశాడని.. హత్యచేసి, శరీర భాగాలను కోసిన సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకున్నాడని వివరించారు. అలాగే ఎలాంటి ఆధారాలు దొరక్కుండా తనకు చెందిన రెండు ఫోన్లలోని డేటా మొత్తాన్ని తొలగించినట్టు సమాచారం.

20 మీటర్లకు ఓ ముక్క.. యువతికి వాట్సాప్‌లో ఫొటోలు!

పోలీసులు లొంగిపోయిన హరిహరకృష్ణను ఘటనా స్థలానికి తీసుకెళ్లి విచారించారు. మద్యం మత్తులోనే నవీన్‌ను హత్య చేసినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నవీన్ శరీరాన్ని ముక్కలుగా చేశాక.. 20 మీటర్లకో భాగాన్ని దూరదూరంగా పారేసినట్టు తేల్చారు. ఆ భాగాలను పోలీసులు సేకరించి ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. ఇక నవీన్‌ను కిరాతకంగా చంపిన హరిహరకృష్ణ.. అతడి శరీర భాగాలను ఫొటోలు తీసి ప్రేమించిన యువతికి, పలువురు ఇంటర్ స్నేహితులకు వాట్సాప్ ద్వారా పంపినట్టు తెలిసింది.

పథకం ప్రకారమే హత్య

నవీన్ హత్య పథకం ప్రకారమే జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. నిందితుడు తన వెంట పదునైన కత్తిని తీసుకుని వచ్చాడంటే అది క్షణికావేశంలో జరిగిన హత్యగా కనిపించడం లేదు. కొంతకాలంగా నవీన్‌పై హరిహరకృష్ణ పెంచుకున్న పగే ఈ హత్యకు దారితీసినట్టు తెలుస్తోంది. దర్యాప్తులో అన్ని విషయాలు తేలుస్తాం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తాం.

– సాయిశ్రీ, డీసీపీ ఎల్బీనగర్

విషాదంలో వంకరాయి తండా

నవీన్ హత్య విషయం తెలియడంతో అతడి స్వగ్రామం వంకరాయితండాలో విషాదం అలుముకుంది. నవీన్ తండ్రి శంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి వసంత కూలిపనులకు వెళ్తుంది. గ్రామం నుంచి కల్వకుర్తికి వలస వచ్చిన వారిద్దరూ.. కష్టపడి పనిచేస్తూ కుమారుడిని ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు దారుణంగా హత్యకు గురికావడంతో కన్నీటిలో మునిగిపోయారు. పోలీసులు శనివారం సాయంత్రం నవీన్ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రికి వంకరాయితండాలో అంత్యక్రియలు నిర్వహించారు.


నవీన్ స్వగ్రామం వంకరాయి తండాలో విషాదఛాయలు

మల్లన్న సేవలో సీజేఐ


ఆలయం వద్ద సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కి స్వాగతం పలుకుతున్న దేవస్థానం చైర్మన్ తదితరులు

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనుంజయ వై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, అర్చక స్వాములు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి దంపతులు రత్నగర్భ స్వామిని, తర్వాత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని, భ్రమరాంబాదేవి అమ్మ వారిని దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమల చూపు ఏపీ వైపు

- 44 నెలల్లో వాస్తవ రూపంలోకి రూ.75,649.77 కోట్ల పెట్టుబడులు
- ఇందులో భారీ, మెగా యూనిట్ల రూపేణా రూ.56,534.53 కోట్లు

సాక్షి, అమరావతి: పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోని దిగ్గజ సంస్థలు పారిశ్రామిక అనుకూల విధానాలున్న ఏపీ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ సంస్థలు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్ వంటి పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన వచ్చింది.

14,36,992 మందికి ఉపాధి

సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టాక 2019 జూన్ నుంచి 2023 జనవరి వరకు రూ.75,649.77 కోట్ల విలువైన పెట్టుబడులు (ఎంఎస్ఎంఈ సహా) వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇందులో 111 భారీ, మెగా యూనిట్లు రూ.56,534.53 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 73,876 మందికి ఉపాధి లభించింది. అంటే సగటున ఏడాదికి రూ.15,418 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి మొదలైంది. ఇందులో సీఎం వైఎస్ జగన్ చేతులు మీదుగా రూ.13,766 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఆరు యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి లభించింది. ఇవి కాకుండా రూ.7,305 కోట్ల విలువైన కియా పరిశ్రమ వాణిజ్య పరమైన ఉత్పత్తిని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2019 డిసెంబర్ 5న లాంఛనంగా ప్రారంభించారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ రంగంలో 1,52,558 కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.19,115.24 కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా 13,63,706 మందికి ఉపాధి లభించింది. ఇవికాకుండా మరో 86 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,35,125.60 కోట్ల విలువైన పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కూడా వాస్తవ రూపంలోకి వస్తే 2,36,806 మందికి ఉపాధి లభించనుంది.

ప్రకృతి సాగులో ఏపీ ఆదర్శం

కేంద్రం ప్రశంసలు.. సామాజిక ఆర్థిక సర్వేలో ప్రస్తావన

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏపీలో ఉద్యమంలా సాగుస్తున్న ప్రకృతి వ్యవసాయానికి అరుదైన గౌరవం దక్కింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇటీవల విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేలో ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రశంసించింది. అన్ని రాష్ట్రాలూ ఏపీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించింది. తొలుత 704 గ్రామాల్లో 40 వేల మందితో ప్రారంభమైన ప్రకృతి సాగు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఓ ఉద్యమంలా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రైతులు కాకుండా ఈ ఉద్యమంలో ఇప్పటివరకు 1.32 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వాములయ్యారు. 1.71 లక్షల మంది పేద, మధ్య తరగతుల ప్రజలు ఇళ్లలో కిచెన్ గార్డెన్లను పెంచుతున్నారు. ఏపీ స్ఫూర్తితో ఈ ఏడాది జాతీయ స్థాయిలో కోటి ఎకరాల్లో ప్రకృతి సాగుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

మన్ననూరులో సీజేఐ



మన్ననూర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌నుంచి రోడ్డు మార్గాన వెళుతూ మన్ననూరులోని మృగవాణి రెస్టారెంట్‌లో కాసేపు సేదతీరారు. రెండు రోజుల అనాధికారిక పర్యటనలో భాగంగా సీజేఐ వచ్చినట్లు తెలిసింది.ఈ క్రమంలో అధికార కార్యక్రమాలు, వందన సమర్పణ, ఫొటో తదితర ప్రత్యేక కార్యక్రమాలు ఏవి జరగలేదు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి, జిల్లా జడ్జి రాజేష్‌బాబు, ఎస్పీ మనోహర్, సివిల్ జడ్జిలు సబిత, స్వరూప్, డీఎండీహెచ్ఓ సుధాకర్‌లాల్, పోలీస్, అటవీశాఖ అధికారులు, తదితరులు సీజేఐను మర్యాదపూర్వకంగా కలిశారు.

1,019 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శనివారం పూర్తి నీటిమట్టం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. ఎడమ కాల్వ నీటిని నిలుపుదల చేసి సమాంతర కాల్వ ద్వారా 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 90 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా పెద్ద రథోత్సవం



వెల్దండ: మండల పరిధిలోని గుండాల గ్రామంలోని శ్రీ అంబా రామలింగేశ్వరస్వామి స్వామి దేవాలయంలో శనివారం తెల్లవారు జామున పెద్ద రథోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని రథోత్సవంపై ఉంచి భక్తులు తేరును లాగారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మైసయ్య, ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ, సురేష్‌శర్మ, నరహరిశర్మ, వీరేశంశర్మ, సంతోష్‌శర్మ, శివశర్మ ఉన్నారు.

బీజేపీని ఓడించే పార్టీకే మద్దతు


చిన్నోనిపల్లె నిర్వాసిత శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

గద్వాల అర్బన్: బీజేపీని ఓడించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీని ఓడించే శక్తి బీఆర్ఎస్ పార్టీకే ఉందని.. మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ గెలుపును కమ్యూనిస్టులుగా ఆపగలిగామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని, కానీ ఆ పార్టీ అమలు చేసే ప్రజా వ్యతిరేక విధానాలు, ధరణి, పోడు భూములు, కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని వివరించారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తోందని.. ప్రతిపక్షాలపై ఈడీ సంస్థలతో దాడులు చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వం అదానీ ఆస్తులపై ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలంటే పార్లమెంట్, అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉండాలని.. అందుకు కార్యకర్తలు ప్రజా ఉద్యమాలు చేయాలన్నారు. అంతకుముందు పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ రమణ, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు వీవీ నర్సింహ, నర్మద, దేవదాసు, మారెన్న ఉన్నారు.

చిన్నోనిపల్లె భూ నిర్వాసితుల శిబిరం సందర్శన..

గట్టు: నీళ్లు, నిధుల కోసమే కొట్లాడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని.. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటేనే అభివృద్ధి సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ అయిదు గ్రామాల నిర్వాసితులు చేస్తున్న ఆందోళన శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నోనిపల్లె రిజర్వాయర్ రద్దు కోసం భూ నిర్వాసితులు ఏడాదిగా పోరాటం చేస్తున్నారని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. రిజర్వాయర్‌ను రద్దుచేసి భూములను రైతులకే అప్పగించాలని డిమాండ్ చేశారు.

అందరూ సహకరిస్తే సాగునీటితో సస్యశ్యామలం

- నష్టపరిహారం అందించిన తర్వాతే పనులు ప్రారంభించాం
- రైతులకు నచ్చజెప్పిన ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు
- ప్రతిపాదనల ప్రకారమే కాల్వ తవ్వకాలు చేపట్టాలని ఆదేశం


కేఎల్ఐ కాల్వ తవ్వకాలకు సహకరించాలని రైతులకు నచ్చజెబుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

ఉప్పునుంతల: మండల పరిధిలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారికి తూర్పు దిశగా కరువుతో అల్లాడుతున్న గ్రామాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలనే ఏకైక లక్ష్యంతోనే ఎంతో కష్టపడి కేఎల్ఐ కాల్వ విస్తరణ పనులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాం.. కొంతమంది రైతులు ఉద్దేశ పూర్వకంగా కాల్వ తవ్వకాల పనులను అడ్డుకుంటే ఈ ప్రాంత రైతులకే నష్టం జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. రైతులు అందరూ సహకరిస్తే ఏడాదిలోపే ఈ ప్రాంతానికి సాగునీటిని అందించి సస్యశ్యామలం చేస్తామని అన్నారు. శనివారం మండలంలోని పిరట్వానిపల్లి శివారులో కేఎల్ఐ కాల్వ విస్తరణ పనులను అడ్డుకున్న కొంతమంది రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కాల్వ తవ్వకాల్లో నష్టపోతున్న భూమికి పరిహారం ఎక్కువగా ఇప్పించాలని, మంజూరైన ప్రతిపాదన ప్రకారం కాకుండా కాల్వ తవ్వకాల్లో కొంతమార్పు చేయాలని రైతులు నిరంజన్, రామకృష్ణ తదితర రైతులు కోరగా.. అందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్వ ప్రతిపాదన మార్పు సాధ్యం కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎకరాకు రూ.9.39 లక్షలు పరిహారం ఇప్పటికే కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందని, మిగిలిన వారు బ్యాంక్ ఖాతాలు అందిస్తే వెంటనే పరిహారం అందేలా కృషిచేస్తానని తెలిపారు. కొంత మంది ఉద్దేశ పూర్వకంగా పనులకు ఆటంకం కల్గిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రజాప్రయోజనాల కోసం భూసేకరణ చట్టాన్ని ప్రభుత్వం పగడ్బందీగా అమలు చేస్తున్న క్రమంలో చట్ట ప్రకారం భూములను సేకరించి కాల్వలను తవ్వడం జరుగుతుందని చెప్పారు. మంజూరైన ప్రతిపాదనల ప్రకారమే కాల్వ తవ్వకాలను జరపాలని కాంట్రాక్టర్‌కు సంబంధించిన సైట్ ఇంజనీర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఒక్కరిద్దరు రైతుల కోసం ఆలోచిస్తే సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.

15 వేలకు ఎకరాలకు సాగునీరు..

అచ్చంపేట మండలం పుల్జాల నుంచి ఉప్పునుంతల మండలం రాయిచెడ్, పిరట్వానిపల్లి, అయ్యవారిపల్లి మీదుగా పెనిమిళ్ల వరకు రూ.95 కోట్లతో 15 కిలోమీటర్ల మేర ప్రధాన కేఎల్ఐ కాల్వ విస్తరణ పనులు చేపట్టనున్నారు. 14 వరకు పిల్ల కాల్వల పనులు చేయనున్నారు. సహకరిస్తే ఆరు నెలల్లో కాల్వ పనులు పూర్తిచేయించి వచ్చే ఈ సీజన్ వరకు సాగునీటి అందించి ఈ ప్రాంతాన్ని పచ్చని పంటలతో సస్యశ్యామలం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శివ, బాలునాయక్, మల్లేష్, ఎంపీటీసీ మల్లేష్, అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ కట్టా గోపాల్‌రెడ్డి, రవీందర్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండలో భక్తజన సందోహం


మన్యంకొండలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. మన్యంకొండ దేవస్థానానికి విశేష దినాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. దీంతో మన్యంకొండ ఒక్కసారిగా జనసంద్రమైంది. ఎక్కడా చూసినా మన్యంకొండలో భక్తులే కనిపించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విశేష సేవలు పూర్తయినప్పటికినీ దేవస్థానానికి వచ్చే భక్తుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

వైభవంగా తిరుచ్చిసేవ..

మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చిలో స్వామివారిని గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. బంగారు ఆభరణాలు, రకరకాల పూల అలంకరణలో స్వామివారు లైట్ల వెలుతురులో ధగధగ మెరిసిపోతూ శేష వాహనంలో ఊరేగుతూ భక్త కోటికి దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి సేవను చూసి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు.


తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న అర్చకులు



ఉపాధ్యాయుల అలసత్వం.. సర్పంచ్ ఆదర్శప్రాయం

ఇక్కడ పుస్తకం చేతిలో పట్టుకొని విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నది ఉపాధ్యాయుడు అనుకుంటే పొరపాటు పడినట్టే. ఈయన పేరు తరుణ్. నవాబుపేట మండలంలోని కొత్తకుంటతండా సర్పంచ్. శనివారం తండాలోని ప్రాథమిక పాఠశాలకు రావాల్సిన ఇద్దరు ఉపాధ్యాయులు సమయానికి రాకపోవడంతో సర్పంచే స్వయంగా విద్యార్థులతో ప్రార్థన చేయించి.. చక్కగా పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు ఆలస్యంగా వస్తున్నారని, పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేదని ఆయన వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– నవాబుపేట